
ప్రజాశక్తి
ఆదివారం 18 మే 2025 5 విజయనగరం



సార్వత్రిక సమ్మె జులై 9కు వాయిదా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

లేబర్‌కోడ్‌లకు వ్యతిరేకంగా ఈనెల 20న కార్మిక సంఘాలు తలపెట్టిన సార్వత్రిక సమ్మెను దేశంలో ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జులై 9నాటికి వాయిదా వేసినట్లు కేంద్ర కార్మిక సంఘాలు ఒక ప్రకటనలో తెలిపాయి. అప్పటివరకు ప్రజల్లో సమ్మె ప్రచారాలను కొనసాగించాలని నాయకులు పేర్కొన్నారు. జులై 9వ తేదీన సమ్మెను జయప్రదం చేసేందుకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం దూకుడుగా అమలు చేయాలని చూస్తున్న లేబర్ కోడ్స్ వెంటనే రద్దు చేయాలని, కార్మికుల హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు.

పేదింటి కుసుమాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎటువంటి ఆసరా లేని బాలికల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాల్లో విద్యార్థులను ఉన్నత స్థానాలకు చేరుకుంటున్నారు. ఆయా విద్యాసంస్థలు పేద విద్యార్థినుల చదువుకు బాసటగా నిలవడంతో వారంతా వారంతా ఉన్నత విద్యను అభ్యసించి వివిధ ఉద్యోగాలు సాధిస్తున్నారు. విజయనగరం జిల్లాలో 23 కెజిబివి పాఠశాలలు ఉన్నాయి. ప్రతి పాఠశాలల్లో 6 వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు పిల్లలు చదువుకునేందుకు అవకాశం ఉంది. అక్కడే వారికి భోజన వసతితోపాటు ఉచిత విద్యను అందిస్తున్నారు. కెజిబివి పాఠశాలలు ఏర్పాటు అయినప్పటి నుంచి చదివిన విద్యార్థులలో సుమారు 508 మంది విద్యార్థినులు వివిధ హోదాల్లో ఉద్యోగాల్లో స్థిరపడి మిగతా విద్యార్థులకు మార్గదర్శకంగా నిలుస్తున్నారు. పేద కుటుంబాల నేపథ్యం. తల్లిదండ్రులు పడే కష్టాలను చూసి ఎప్పటికైనా మంచి స్థానాల్లో నిలవాలనే సంకల్పం వెరసి విద్యార్థినులంతా మట్టిలో మాణిక్యాలుగా రాణిస్తున్నారు. కెజిబివిలో చదువు పూర్తి చేసుకున్న బాలికలు ఎలా ఉన్నారు.. వారు ఏమి చేస్తున్నారో తెలుసుకోవాలని విజయన గరం జిల్లా సమగ్రశిక్షా అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త డాక్టర్ ఎ. రామారావు ఏప్రిల్ 5 నుంచి 21 వరకు వివరాలు సేకరించారు. వారు చేపట్టిన కేసు స్టడీ లో అనేక రంగాల్లో ఉద్యోగాలు చేస్తున్న ఉన్నత శిఖరాలను, మంచి భవిష్యత్ ను ఏర్పాటు చేసుకున్న విద్యార్థినులు ఉన్నట్లు గుర్తించారు.

50 రంగాలు.. 76 రకాల ఉద్యోగాలు

గత 20 ఏళ్లలో విజయనగరం జిల్లాలోని 26 కెజిబివిల్లో చదువుకుని సుమారు 7 వేల మందికి పైగా బయటకు వెళ్లారు. వారిలో 508 మంది స్థితిగతులపై అధ్యయనం చేశారు. 126 మంది (24.81 శాతం) ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరి నట్లు తేలింది. మరో 374 మంది (73.60 శాతం) ప్రైవేటు సంస్థల్లో కొలువు సాధించారు. మిగిలిన 1.5 శాతంలో ఏడుగురు ఉన్నత స్థానంలో ఉన్న వారిలో వ్యాపార రంగంలో స్థిరపడ్డారు. ఒకరు సర్పంచిగా ఎన్నికయ్యారు. 50 రంగాల్లో 76 రకాల ఉద్యోగాలు చేస్తున్నట్లు గుర్తించారు. వీరిలో డాక్టర్లు- 4, బ్యాంకు ఉద్యో గులు- 13, అకౌంటెంట్లు- 10, తపాలా ఉద్యోగులు- 44, ఇంజినీర్లు, ఇంజినీరింగ్ కళాశాల లెక్చరర్లు- 62, ల్యాబ్ అసి స్టెంట్లు- 15, స్టాఫ్ నర్సులు- 134, ఫార్మా సిస్టులు- 32, ఆర్మీ, నేవీ, సిఐఎస్ఎఫ్, సివిల్, సిఆర్‌పిఎఫ్, బిఎస్ఎఫ్ కానిస్టేబుళ్ల, ఉపాధ్యాయినులు 20మంది ఉన్నారు. మిగిలిన వారు రైల్వే, సచివాలయ ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. నటన, క్రీడా రంగాల్లో స్థిరపడిన వారు ఒక్కొక్కరు ఉన్నారు. నేడు లక్షలు పెట్టి చదువుకుంటే తప్ప ప్రభుత్వ రంగంలో ఉద్యోగాలు, డాక్టర్ వంటి ఉద్యోగాలు పొందలేని పరిస్థితి ఉంది. ఎటువంటి ఆర్థిక స్తోమత లేని పిల్లలు డాక్టర్ కావడం, 50 రంగాల్లో 508 మంది బాలికలు ఉద్యోగాల్లో స్థిరపడటం అంటే మాటల్లో చెప్పలేనిది. లక్షలు పెడితే తప్ప ఉద్యోగం రాని నేటి సమాజంలో తినడానికి తిండి లేని పిల్లలు కెజిబివిల్లో చేరి వివిధ ఉద్యోగాల్లో స్థిరపడటం జిల్లాకు గర్వకారణం.

50 శాఖల్లో 508 మంది ఉద్యోగాలు

ఆదర్శంగా నిలిచిన కెజిబివి పూర్వ విద్యార్థులు



శివగాయత్రి (సిఐఎస్ఎఫ్), దేవి (సిఐఎస్ఎఫ్), దివ్య (కానిస్టేబుల్), పద్మావతి (డాక్టర్), నవీన(ఆడిట్ ఆఫీసర్), దేవిక (పోస్టల్), సరస్వతి(టీచర్), స్వాతి (సాఫ్ట్‌వేర్), సోని (అకౌంటెంట్)

విద్యార్థుల విజయాల్లో భాగస్వాములుగా ఉంటాం

విద్యార్థుల మంచి భవిష్యత్ ఏర్పాటు చేసుకోవడంలో మేము, మా సిబ్బంది భాగస్వాములుగా ఉంటాం. మంచి విద్యను అందించేందుకు, మంచి భవిష్యత్ ఏర్పాటు చేసుకునేందుకు అన్ని విధాలా కీలకపాత్ర పోషించడమే కాకుండా అంకితభావంతో శ్రమిస్తోన్న కెజిబివి టీచర్లు, సిబ్బందికి అభినందనలు. విప్లవాత్మక మార్పులు, ఏర్పాటు చేస్తున్న మౌలిక సదుపాయాలు..కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలను మరింత ఉన్నతంగా మారబోతున్నాయి. మంచి విద్యతో పాటు,మంచి భవిష్యత్ ఏర్పాటు చేసుకోవడంలో విద్యార్థులకు తోడ్పాటు అందిస్తాం.

- డాక్టర్ ఎ.రామారావు, ఎపిసి, సమగ్ర శిక్ష, విజయనగరం

ఆస్పత్రిని తరలించొద్దు

అక్కడే కొనసాగించేందుకు పరిశీలించాలి : మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-కంటోన్మెంట్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ ఆస్పత్రిని మెడికల్ కాలేజికి తరలించకుండా ఆసుపత్రిని అక్కడే కొనసాగించడానికి గల అవకాశాలను పరిశీలించాలని రాష్ట్ర ఎంఎస్ఎంఇ, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ప్రస్తుతం నడుస్తున్న ఆసుపత్రి నగరం మధ్య లో ఉంటూ, ప్రజలందరికీ అందుబాటులో ఉంటుందని, అనేక మంది ప్రజలు ఇక్కడే ఆసుపత్రి కొనసాగించాలని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారని మంత్రి తెలిపారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంత్రి వైద్యాధికారులు, ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిజిహెచ్ భవనాల మాస్టర్ ప్లాన్ తీసుకొని భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా అభివృద్ధి చేయడానికి ఎటువంటి అవకాశాలు ఉన్నాయో అంచనాలను తయారు చేయాలన్నారు. సుమారు 4 ఎకరాల వరకు జిజిహెచ్‌లో వినియోగంలో లేకుండా ఖాళీగా ఉన్నట్లు గుర్తించారని, ఈ స్థలంలో బెడ్ల సంఖ్య పెంచడం, ఇతర స్పెషాలిటీలను ఏర్పాటు చేయవచ్చునని అభిప్రాయం వ్యక్తం చేశారు. అయితే 15 రోజుల్లో ప్రస్తుత ఆసుపత్రి వివరాలను మాస్టర్ ప్లాన్ తో సహా అందించాలని ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించారు. సమావేశంలో ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, స్థానిక ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అప్పలనాయుడు, మెడికల్ కాలేజ్ ఇంచార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శివ శ్రీధర్, ఎపిఎంఎస్ఐడిసి ఇఇ ఎం.శ్రీనివాస మూర్తి, డిఇఇ కుమార్, హెచ్ఒడిలు, అసోసియేట్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

తప్పని డోలిమోత

ప్రజాశక్తి-శృంగవరపుకోట



డోలిపై రోగిని తీసుకొస్తున్న గిరిజనులు


గిరిశిఖర గ్రామాల గిరిజనులకు డోలిమోతలు నిత్యకృత్యమవుతున్నాయి. శృంగవరపుకోట పంచాయతీ రేగపుణ్యగిరి గ్రామానికి చెందిన పాంగి లింబయ్యమ్మ విషజ్వరంతో బాధపడుతోంది. శనివారం ఆమె భర్త పాంగి నర్సింగరావు తోటి గిరిజనుల సహాయంతో డోలి కట్టి మోసుకుంటూ కొండ దిగువకు తీసుకొచ్చారు. ఈ విషయం తెలుసుకున్న జనసేన నియోజకవర్గ నాయకుడు వబ్బిన సన్యాసినాయుడు 108కి ఫోన్ చేసి కొండ దిగువకు వాహనాన్ని రప్పించారు. అక్కడి నుంచి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి 108 వాహనంలో ఆమెను తరలించి, వైద్యాన్ని అందించారు.

పార్వతీపురం ఎమ్మెల్యేపై

సమగ్ర విచారణ చేపట్టాలి

- మహిళా అధికారితో వాట్సప్ కాల్ మాట్లాడే అధికారం ఎవరిచ్చారు?
- అధికారులకు భద్రత కల్పించాలి : వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు

మహిళా అధికారిపై రాత్రి సమయంలో వాట్సప్ ఫోన్ చేసి బెదిరించిన పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్రపై విచారణ జరిపించి, అధికారులకు రక్షణ కల్పించాలని వైసిపి జిల్లా అధ్యక్షులు, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శనివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్వతీపురం ఎమ్మెల్యే తహశీల్దార్‌ను దూషించడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అధికారులపై జరుగుతున్నాయన్నారు. ఉమ్మడి జిల్లా చరిత్రలో ఎమ్మెల్యేపై ఒక అధికారి ఫిర్యాదు చేయడం తొలిసారన్నారు. మహిళా రెవెన్యూ అధికారికి రాత్రి పది గంటల సమయంలో ఫోన్ చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. తహశీల్దార్ రాత పూర్వక ఫిర్యాదు పోలీసులకు ఇచ్చారని తెలిపారు. అధికారులపైకి టిడిపి నాయకులను ఉసిగొల్పడం సరికాదన్నారు. మహిళా అధికారిపై ఎమ్మెల్యేగా అసభ్యకరంగా మాట్లాడితే జిల్లాకు చెందిన మంత్రి స్పందించకపోవడం విచారకరమని అన్నారు. ములగ గ్రామ రైతులను ఎమ్మార్వో పది లక్షల అడిగారని చెప్పి ఆమెను అవినీతి పరులుగా చిత్రించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. డబ్బులు ఇచ్చారని రైతులు చెప్పకపోతే మరి ఎవరు ఎమ్మెల్యేకు డబ్బులు అడిగినట్లు చెప్పారని ప్రశ్నించారు. ప్రజా జీవితంలో లేకపోవడం వలన ఎవరితో ఎలా వ్యవహరించాలో తెలియని స్థితిలో ఉన్నారన్నారు. ఆమె మానసిక స్థితి బాగోలేదని వ్యాఖ్యానించడం సమంజసం కాదన్నారు. ఎమ్మెల్యేపై తక్షణం ఎఫ్ఐఆర్ నమోదు చేసి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ మంత్రి కలుగజేసుకొని విచారణ జరిపి, అధికారులకు రక్షణ కల్పించాలని కోరారు. సమావేశంలో పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే ఆలజంగి జోగారావు, నాయకులు కెవి సూర్యనారాయణ రాజు, ఇప్పిలి అనంత్, వర్రినరసింహమూర్తి, జై హింద్‌కుమార్ పాల్గొన్నారు.

సైన్యానికి మద్దతుగా ర్యాలీలు

ప్రజాశక్తి-శృంగవరపు కోట

భారత సైన్యానికి మద్దతుగా ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఆధ్వర్యాన శనివారం శృంగవరపుకోటలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ ద్వారా సైన్యం సత్తాచాటిందన్నారు. కార్యక్రమంలో టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ ఇందుకూరి సుధారాణి, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి వబ్బిన సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : ఉగ్రవాదానికి వ్యతిరేకంగా సైనికులు చేపట్టిన ఆపరేషన్ సింధూర్‌కు మద్దతుగా పట్టణంలో శనివారం కూటమి ఆధ్వర్యంలో 150 అడుగులు జాతీయ జెండాతో తిరంగా ర్యాలీ చేశారు. దేశాభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఉగ్రవాదులు భారత్‌పై దాడి చేస్తున్నారని మాజీమంత్రి సుజయకష్ణ రంగారావు, ఎమ్మెల్యే బేబినాయన, బుడా చైర్మన్ తెంటు రాజా, బిజెపి ఇంచార్జి మరిశర్ల రామారావు, జనసేన నియోజకవర్గ ఇంఛార్జి గిరడ అప్పలస్వామి విమర్శించారు. ఉగ్రవాదానికి పాకిస్థాన్ మద్దతు ఇవ్వడం అన్యాయమన్నారు.



బొబ్బిలిలో 150 అడుగుల జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న కూటమి నాయకులు, పట్టణ ప్రజలు

చీపురుపల్లి : ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా చీపురుపల్లిలో భారత్ సైన్యానికి మద్దతుగా శనివారం సంఘీభావ ర్యాలీ చేశారు. ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీ ఎంపిడిఓ కార్యాలయం వద్ద ప్రారంభమై సంతాన లక్ష్మి ఆలయం వరకు మెయిన్ రోడ్డు మీదుగా సాగింది. స్థానిక మూడు రోడ్ల కూడలి వద్ద మానవ హారం నిర్వహించారు. అనంతరం విశ్రాంత సైనికులను సన్మానించారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గద్దె బాబూరావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్ నాయుడు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



శృంగవరపుకోట, చీపురుపల్లిలో ర్యాలీలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యేలు కోళ్ల లలితకుమారి, కళావెంకటరావు, తదితరులు

టిడిపిలో చేరిన వైసిపి కౌన్సిలర్లు

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపాలటీలోని ఐదుగురు వైసిపి కౌన్సిలర్లు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. మున్సిపల్ ఛైర్మన్ సావు వెంకట మురళీకృష్ణపై అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇచ్చిన 10మంది వైసిపి కౌన్సిలర్లలో ఐదుగురు కౌన్సిలర్లు మరిపి తిరుపతిరావు, తెంటు పార్వతి, ఎస్.లక్ష్మి, కె.రామరావు, దిబ్బ సునీత శనివారం టిడిపిలో చేరారు. మాజీమంత్రి సుజయకృష్ణ రంగారావు, బుడా ఛైర్మన్ తెంటు రాజా, ఎమ్మెల్యే బేబినాయన కండువాలు వేసి ఆహ్వానించారు. ఈనెల 19న మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక జరగనుంది. టిడిపితోనే అభివృద్ధి సాధ్యమని సుజయకృష్ణ రంగారావు, బేబినాయన, తెంటు రాజా అన్నారు.

5, 6న ఎపిజిఇఎ రాష్ట్ర కౌన్సిల్

విజయనగరంటౌన్: కొన్నేళ్లుగా ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని జూన్ 5,6తేదీల్లో విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కంది వెంకటరమణ తెలిపారు. ఈ మేరకు కౌన్సిల్ పోస్టర్‌ను ఇంచార్జ్ డిఆర్ఒ, డిప్యూటీ కలెక్టర్ ఇ.మురళితో ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బి.బాల భాస్కరరావు, కోశాధికారి వై.శంకరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.భూషణరావు, ఉపాధ్యక్షులు వై ఆర్ అనిల్ కుమార్, జిల్లా జాయింట్ సెక్రటరీ జె.మహేష్ పాల్గొన్నారు.

85 కేసుల్లో 8.50 లక్షల జరిమానా

కంటోన్మెట్ : మద్యం సేవించి వాహనాలు నడిపి, పట్టుబడిన 85 మంది వాహనదారులకు ఒక్కొక్కరికి రూ.10వేలు జరిమానాను విజయనగరం అడిషనల్ జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎం.ఎస్.హెచ్.ఆర్. తేజ చక్రవర్తి విధించారు. ట్రాఫిక్ సిఐ సూరి నాయుడు ఆధ్వర్యంలో మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టి 85 కేసులు నమోదు చేశారు. వారిని అడిషనల్ జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వారి వద్ద హాజరుపర్చగా, ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున మొత్తం 85 మందికి రూ.8.50లక్షలు జరిమానా విధించారు.

ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చు

విజయనగరం : ఓటరు జాబితాలో పేరు నమోదు కోసం ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చునని ఇన్చార్జి డిఆర్ఒ మురళి అన్నారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో తమ ఛాంబర్లో శనివారం సమావేశం నిర్వహించారు. రాజకీయ పార్టీల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ, ఓటరు జాబితాలో పేరు నమోదు కోసం ఏడాది పొడవునా ఎప్పుడైనా ఫారం 6 లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. అదేవిధంగా మార్పులు చేర్పుల కోసం ఫారం 8, తొలగింపుల కోసం ఫారం 7 లో దరఖాస్తు చేయాలని సూచించారు. శిథిలావస్థకు చేరిన పోలింగ్ బూత్ ఎక్కడైనా ఉంటే వాటిని తొలగించేందుకు ప్రతిపాదనలు పంపిస్తామని, వాటి వివరాలను అందజేయాలని కోరారు. ఒక పోలింగ్ కేంద్రంలో 1500 కంటే ఎక్కువ ఓటర్లు ఉంటే, మరొక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదిస్తామని చెప్పారు. జిల్లాలో ఇప్పటికే 1200 ఓటర్లు పైబడిన కేంద్రాలు 138 వరకు ఉన్నాయని మురళి తెలిపారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రచారం

ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి -కంటోన్మెంట్

మాదక ద్రవ్యాల వలన కలిగే అనర్థాలను యువతకు వివరించి, డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు సంకల్పించి ప్రత్యేకంగా 'సంకల్ప రథం' ను రూపొందించినట్లు ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. ఈ సంకల్ప రథంతో ప్రజల్లో మరింత చైతన్యం తీసుకొని వచ్చేందుకు జిల్లా వ్యాప్తంగా రోజూ ఒక మండలాన్ని సందర్శించి, స్థానిక పోలీసు స్టేషను అధికారి మరియు సిబ్బంది సహకారంతో ఉదయం కళాశాలల్లో వాహనాన్ని నిలిపి, విద్యార్థులకు డ్రగ్స్ వలన కలిగే అనర్థాలను ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. సాయంత్రం సమయాల్లో అదే మండలంలోని ముఖ్య ప్రాంతం లేదా కూడలిలో వాహనాన్ని నిలిపి, ప్రజలకు, యువతకు మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్థాలను వివరిస్తున్నట్లు తెలిపారు.

పరిశుభ్రత జీవితంలో భాగం

కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-గుర్ల




ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ అంబేద్కర్, అధికారులు, ప్రజాప్రతినిధులు

వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి జీవితంలో భాగం కావాలని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ కోరారు. మన ప్రాంతం, మన రాష్ట్రం స్వచ్ఛదనంతో ఉన్నప్పుడే స్వర్ణాంధ్ర సాధ్యమవుతుందని చెప్పారు. ప్రతిఒక్కరూ స్వచ్ఛాంధ్ర సాధనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గుర్ల మండలంలో శనివారం నిర్వహించిన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ముందుగా గుర్ల జంక్షన్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలలో స్వచ్ఛాంధ్ర సభను నిర్వహించారు. ముందుగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. వేడి వాతావరణం నుంచి ఉపశమన చర్యలు, వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన అంశాలను పిహెచ్‌సి వైద్యాధికారి శ్రీధర్ వివరించారు. అందరితో ఎంపిడిఒ శేషుబాబు స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ఉష్ణతాపం నుంచి ఉపశమనం కల్గించే లక్ష్యంతో ఈ నెల స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ రోజు నుంచీ నెల రోజులపాటు నిర్వహించే కార్యక్రమాల్లో వేడి నుంచి రక్షణ పొందే మార్గాలు, వడదెబ్బపై అవగాహన, నివారణ చర్యలను సూచించడం, చలివేంద్రాల ఏర్పాటు, మజ్జిగ, ఒఆర్ఎస్ పంపిణీ తదితర కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. పశు పక్షాదులకు సైతం తాగునీరు అందించే ఏర్పాటు చేయాలని కోరారు. క్లాప్ మిత్రలు గంధవరపు అచ్చెప్పడు, బొత్స పోలిరాజు, ఎఎన్ఎం సింహాద్రి సంతోషి కుమారి, ఆశా వర్కర్లు వల్లె పైడిరాజు, రేగాన రాజేశ్వరిని సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిపి పొట్నూరు ప్రమీల, జెడ్‌పిటిసి సీర అప్పలనాయుడు, జెడ్‌పి సిఇఒ బివి సత్యనారాయణ, డిపిఒ టి.వెంకటేశ్వర్రావు, ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ ఆశయ్య, మండల ప్రత్యేకాధికారి పెంటోజీరావు, ఇతర మండల స్థాయి అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

స్కూళ్ల మూసివేతలో దొందూదొందే

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



ప్రభుత్వ స్కూళ్ల మూసివేత విషయంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు దొందూ దొందే అన్నట్టుగా నడుస్తున్నాయి. అధికారం కోసం ఎవరికి వారే వ్యవహరించినా పాలన విషయంలో మాత్రం ఒక్కటేనని మరోసారి నిరూపించుకున్నారని జనం ప్రజాదృక్కోణంగల విద్యావేత్తలు, ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు చర్చించుకుంటున్నారు. నూతన విద్యావిధానంలో భాగంగా రేషనలైజేషన్ పేరుతో స్కూళ్లను విలీనం చేస్తూ 117 జిఒ జారీచేసిన సంగతి తెలిసిందే. పాఠశాలల మెర్జింగ్ పేరిట తీసుకున్న ఈ నిర్ణయం గత విద్యాసంవత్సరం 3,4,5వ తరగతుల విద్యార్థులను ప్రభుత్వ విద్యకు దూరం చేసింది. లక్షలాది మంది విద్యార్థులు ప్రైవేటు స్కూళ్లలో చేరాల్సివచ్చింది. ఆర్థికంగా అవకాశం లేనివారు అష్టకష్టాలు పడుతున్నారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందనే సాకుతో చాలా స్కూళ్ల మూసివేయడం, మరికొన్ని సింగల్ టీచర్ స్కూళ్లుగా మారిపోవడం తెలిసిందే. ఈనేపథ్యంలో గత ఎన్నికల ముందుకు కేవలం ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలే కాకుండా విద్యార్థుల తల్లిదండ్రులు సైతం ఆందోళన బాటపట్టారు. దీన్ని కూడా ఎన్నికల్లో ఓట్లుగా మలుచుకోవాలని భావించిన కూటమి, ముఖ్యంగా టిడిపి నాయకులు విద్యావ్యవస్థను నాసనం చేసే 117 జిఒను ఏకంగా రద్దుచేస్తామని తెగేసి చెప్పారు. ఓ రకంగా చెప్పాలంటే మన జిల్లాలో టిడిపికి ఓట్ల రూపంలో బాగా కలిసొచ్చిన అంశమే. ఏరుదాటే వరకు ఓడ మల్లన్న... ఏరు దాటాక బోడి మల్లన్న అన్నట్టుగా ఎన్నికల్లో పేద విద్యార్థుల భిష్యత్తుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్న టిడిపి, జనసేన కూటమి తీరా అధికారంలోకి వచ్చాక 117 జిఒ రద్దుకు మీనమేషాలు లెక్కించింది. ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు విద్యామంత్రి పరువు తీసి భత్యం కట్టేయడంతో ఎట్టకేలకు జిఒను రద్దుచేయక తప్పలేదు. చింత చచ్చినా పులుపు చావదన్నట్టుగా జిఒను రద్దుచేసినా కేంద్ర ప్రభుత్వం బలవంతంగా రుద్దుతున్న నూతన విద్యా విధానం అమలు విషయంలో మాత్రం కూటమి ప్రభుత్వం వెనుకాడడం లేదు. ఈ విషయంలో నాడు జగన్ ప్రభుత్వం బాటులోనే చంద్రబాబు ప్రభుత్వం కాలుదూర్చింది. పాత సీసాలో కొత్త సారా మాదిరిగా స్కూళ్లను మూసివేసి, ఉపాధ్యాయ పోస్టులు కుదింపే లక్ష్యంగా తీసుకొచ్చిన 117 జిఒను రద్దుచేసినట్లు చెప్పి తిరిగి అవే విధానాలతో 19,20,21వ నెబర్లతో జీవోలను జారీచేసింది. జిల్లాలో అప్రమత్తమైన ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు ప్రభుత్వ గుట్టు రట్టుచేయడంతో జనం రోడ్లపైకి వస్తున్నారు. ఇదేం దొంగబుద్ధి అంటూ ప్రభుత్వ తీరుపై పబ్లిక్ టాక్ ఒకింత హాట్ హాట్‌గానే వినిపిస్తోంది. నాడు జగన్ ప్రభుత్వానికి, నేడు చంద్రబాబు పాలనకు తేడా ఏమిటంటూ ప్రశ్నిస్తున్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో విద్యార్థుల తల్లిదండ్రులు ఏకంగా ప్రత్యక్ష ఆందోళనకు సిద్ధమౌతున్నారు. ఇంత జరుగుతున్నా వైసిపి నాయకులు నోరు మెదపడం లేదు. ఎందుకంటే నాడు వైసిపి అమలు చేసిందే నేడు కూటమి ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోంది. ఈనేపథ్యంలో విద్యారంగ సంస్కరణల అమలు విషయంలో వైసిపి, టిడిపి దొందూ దొందే అంటూ విమర్శలు వినిపిస్తున్నాయి.


సిఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే లోకం మాధవి

సిఎంను కలిసిన ఎమ్మెల్యే మాధవి

ప్రజాశక్తి-భోగాపురం

నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఆయన క్యాంపు కార్యాలయంలో శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి ఆయనకు వివరించారు. నియోజకవర్గంలో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాల గురించి సిఎంకు వివరించారు. రాష్ట్ర అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో నెల్లిమర్ల నియోజకవర్గం ముందుంటుందని ముఖ్యమంత్రికి తెలిపారు.


స్థలాన్ని పరిశీలిస్తున్న అశోక్, మంత్రి శ్రీనివాస్, ఎంపి కలిశెట్టి

టిడిపి కార్యాలయ నిర్మాణ స్థలం పరిశీలన

ప్రజాశక్తి-కంటోన్మెంట్

టిడిపి జిల్లా నూతన కార్యాలయ నిర్మాణానికి ప్రభుత్వ వైద్య కళాశాల వద్ద ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని శనివారం టిడిపి నాయకులు పరిశీలించారు. పొలిట్ బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతి రాజు, విజయనగరం జిల్లా పార్లమెంట్ పార్టీ అధ్యక్షులు కిమిడి నాగార్జున, రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు పరిశీలించారు. వారితో పాటు కొండపల్లి కొండల రావు, విజయనగరం మార్కెట్ కమిటీ ఛైర్పర్సన్ కర్రోతు వెంకట నరసింగరావు, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నరసింగరావు, కనకల మురళీమోహన్, గంటా రవి తదితరులు ఉన్నారు.

వసతిగృహాల్లో తనిఖీలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పట్టణంలోని వసతిగృహాలను శనివారం జూనియర్ సివిల్ జడ్జి బి.కనకలక్ష్మి తనిఖీ చేశారు. విద్యార్థులకు కల్పిస్తున్న వసతి సౌకర్యాలను సంబంధిత వసతి గృహ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యక్షంగా వసతిగృహాల్లో సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి కనకలక్ష్మి మాట్లాడుతూ బాలికల వసతిగృహం మినహాయించి మిగిలిన చోట్ల కనీస సదుపాయాలు లేవన్నారు. భవనాలు కూడా శిథిల దశలో ఉన్నాయని తెలిపారు. వసతిగృహాల్లో సరైన వసతులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. వాటి వివరాలను సంబంధిత జిల్లా అధికారులకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా నివేదించనున్నట్టు వెల్లడించారు. అనంతరం సబ్‌జైల్‌ను తనిఖీ చేశారు. ముద్దాయిలకు కల్పిస్తున్న వసతులను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం గురించి అవగాహన కల్పించాలని సబ్ జైలు అధికారి, సిబ్బందిని న్యాయమూర్తి ఆదేశించారు.

శ్మశానంలో మౌలిక సౌకర్యాలపై హర్షం

ప్రజాశక్తి-బొబ్బిలి

మల్లమ్మపేట శ్మశాన వాటికలో మౌలిక సౌకర్యాలు కల్పనపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బొబ్బిలి మున్సిపాలిటీలోని మల్లమ్మపేట శ్మశాన వాటికలో మౌలిక సౌకర్యాలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీంతో మున్సిపల్ పాలక వర్గం నిధులు కేటాయించి అభివృద్ధి చేసింది. శ్మశాన వాటికను అభివృద్ధి చేయడంతో ఎమ్మెల్యే బేబినాయన, మున్సిపల్ ఛైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులకు కొప్పల వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోల జగన్, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

సచివాలయంలో తనిఖీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని పూల్ బాగ్ కాలనీ లోని 2వ నెంబరు సచివాలయాన్ని సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పౌర సేవలు ఏ విధంగా అందిస్తున్నారన్న వివరాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తూ సిబ్బందికి తగు సూచనలను జారీ చేస్తున్నామన్నారు. సచివాలయ కార్యదర్శులు విధులకు సకాలంలో హాజరయ్యే విధంగా, రికార్డులు సక్రమంగా నిర్వహించేలా తనిఖీలు చేపడుతున్నామన్నారు. తాము చేపట్టే ప్రక్రియలో ఉదాసీనంగా వ్యవహరించి నట్లు గుర్తిస్తే సిబ్బందిపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. మెరుగైన పౌరసేవలు అందించడమే లక్ష్యంగా సచివాలయ కార్యదర్శులు కృషి చేయాలని అన్నారు.

రక్తదాతలు సమాజానికి ఆదర్శం

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

రక్తదాతలు సమాజానికి ఆదర్శమని ఎక్సైజ్ సిఐ చిన్నంనాయుడు అన్నారు. శనివారం కోమటిపల్లి తాండ్ర పాపారాయ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఉన్న మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సంస్థలో కారుణ్య ఫౌండేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ జెసి రాజు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని అతిథులు ఎన్ఆర్ఐ హాస్పిటల్ సిఇఒ సిందిరి శ్రీనివాసన్, ఎక్సైజ్ సిఐ చిన్నంనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నుంచి 31 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. రక్తదాతలకు అతిథులు సర్టిఫికెట్లు, పండ్లు అందించారు. కార్యక్రమంలో మిలీనియం సంస్థ మేనేజర్ తారక్ రాజేష్, విజయనగరం రెడ్‌క్రాస్ సంస్థ పిఆర్ఒ రాము, రెడ్ క్రాస్ సంస్థ లైఫ్ మెంబర్లు శంకరరావు, కృష్ణమోహన్, కరుణ కుమార్, ప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రథమ చికిత్సపై అవగాహన

ప్రజాశక్తి-విజయనగరం

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రథమ చికిత్సపై రెడ్‌క్రాస్ కార్యాలయం వద్ద అవగాహన కల్పించారు.కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, కోఆర్డినేటర్ మన్మథరావు, వాలంటీర్ సహకారంతో అకస్మాత్తుగా జరిగే విపత్తులు, పరిణామాలపై అవగాహన కల్పించారు. ఊహించని విపత్తులపై అవగాహన, శిక్షణ ఇచ్చారు. అనంతరం శిక్షణ పొందిన వారికి ధ్రువ పత్రాలు అందజేశారు. ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు మరిన్ని జరుపుతామని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ కెఆర్‌డి ప్రసాద్ రావు, కార్యదర్శి సతం అన్నారు. కార్యక్రమంలో జిల్లా పిఎంపి అసోసియేషన్ అధ్యక్షులు పి.రామయ్య, రెడ్ క్రాస్ సొసైటీ మేనేజ్మెంట్ కమిటీ మెంబర్ మురళి పాల్గొన్నారు

నేడు మినీ మహానాడు

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్

గజపతినగరంలోని ఓ ప్రయివేటు ఫంక్షన్ హాల్లో ఆదివారం మినీ మహానాడు నిర్వహిస్తున్నట్లు టిడిపి నాయకులు తెలిపారు. అనంతరం సైన్యానికి సంఘీభావంగా బ్రిడ్జి నుంచి సబ్‌స్టేషన్ వరకు పార్టీలకతీతంగా తిరంగా ర్యాలీ చేపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాలకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హాజరవుతున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర

ప్రజాశక్తి-విజయనగరంటౌన్, కంటోన్మెంట్

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ శాఖలు, సంస్థల ఆధ్వర్యంలో మూడో శనివారం సందర్భంగా స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల ఆధ్వర్యంలో ఉష్ణతాపం నుంచి వడగాల్పుల నుంచి ఉపశమనం కల్పించే చర్యలు చేపట్టారు. జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నెలరోజుల పాటు చేపట్టేందుకు వీలుగా శనివారం నుంచి కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సందర్శకుల కోసం తాగునీటి వసతిని ఏర్పాటు చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సిబ్బంది శ్రమదానం చేసి కార్యాలయాలను, ఆవరణలను శుభ్రపరిచారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలో పలుచోట్ల ముఖ్యప్రదేశాల్లో నీడ కల్పించేందుకు టెంట్‌లు ఏర్పాటు చేశారు. ద్వారపూడి గ్రామంలోని వెల్ నెస్ సెంటర్‌లో ప్రభుత్వ వైద్య కళాశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మంచినీటి ఎటిఎంను ప్రారంభించారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డిఇఒ మాణిక్యం నాయుడు ఆధ్వర్యంలో సమగ్ర శిక్ష కార్యాలయం ఆవరణలో ఎపిసి డాక్టర్ ఎ.రామారావు ఆధ్వర్యంలో ఉద్యోగులు స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొని పరిసరాలను పరిశుభ్రం చేశారు. సమాచార పౌరసంబంధాల శాఖ కార్యాలయంలో సిబ్బంది కారిడార్‌లను శుభ్రంచేసి డిపిఆర్ఒ డి.రమేష్ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు.

ఉష్ణ తాపం నుంచి ఉపశమనం పొందాలి : ఎమ్మెల్యే

వేసవి దృష్ట్యా ఉష్ణతాపం నుండి ప్రజలు ఉపశమనం పొందే అన్ని రకాల జాగ్రత్తలను తీసుకోవాలని ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. శనివారం స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా బీట్ ది హీట్ నినాదంతో చేపట్టిన ర్యాలీని ఆమె ప్రారంభించారు. పైడితల్లి అమ్మవారి ఆలయం నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ కోట వరకు సాగింది. అక్కడ ఏర్పాటుచేసిన సోలార్ ప్లాంట్ ఏర్పాటు, మిద్దెపంటల నిర్వహణ వంటి ప్రత్యేక స్టాల్స్‌ను కాపు కార్పొరేషన్ చైర్పర్సన్ పాలవలస యశస్వి తో కలిసి ఆమె పరిశీలించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఉష్ణతాపానికి ఉపశమనం కలిగించే జాగ్రత్తలతో కూడిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఉత్తమ సేవలు కనపరిచిన పారిశుద్ధ్య కార్మికులను, సిబ్బందిని సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తరచూ ద్రవ పదార్థాలు తీసుకుని, శరీర ఉష్ణోగ్రతలను సమతౌల్యం చేసే ఆహారాలను స్వీకరించాలన్నారు. కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ నగరంలో అనేక ప్రాంతాలలో చలివేంద్రాలను ఏర్పాటు చేసామన్నారు. రెండు చోట్ల హరిత కేంద్రాలను రూపొందించామన్నారు. అనంతరం స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ్ చక్రవర్తి, సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు పాల్గొన్నారు.

హరితాంధ్రప్రదేశ్ సాధనలో భాగస్వాములు కావాలి : ఎంపి

హరితాంధ్రప్రదేశ్ సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు పిలుపునిచ్చారు. 47వ డివిజన్ అరుంధతినగర్ లో మొక్కలు నాటే కార్యక్రమంలో ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి, కాపు కార్పొరేషన్ చైర్పర్సన్ పాలవలస యశస్వి, కమిషనర్ పల్లి నల్లనయ్య తో కలిసి ఆయన మొక్కలు నాటారు.

విద్యా శాఖ ఆధ్వర్యంలో బీట్ ద హిట్ కార్యక్రమం

బీట్ ద హీట్ స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా డిఇఒ కార్యాలయం, కలెక్టరేట్ పోర్టికో వద్ద పక్షులకు మట్టి పాత్రల ద్వారా నీటిని అందించే కార్యక్రమాన్ని డిఇఒ యు.మాణిక్యంనాయుడు, డిప్యూటీ డిఇఒలు ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లోనూ, ఎంఆర్‌సిల వద్ద నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టి.రాజేష్ జిల్లాసైన్స్ ఆఫీసర్, జీవవైవిద్య సంరక్షకులు వి. సత్యారావు, ఎన్‌జిసి కోఆర్డినేటర్ బి.వేణుగోపాల్ ఆధ్వర్యాన చేపట్టారు.

విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ

స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా దాసన్నపేట విద్యుత్ భవన్ వద్ద ఎస్ఇ ఎం. లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ను స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ గా మారుస్తామని సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. అనంతరం విద్యుత్ భవన్ నుంచి కోట జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఇ మాట్లాడుతూ మన చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతఅని అన్నారు. పిఎం సూర్యఘర్ పథకాన్ని ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. ర్యాలీ లో డిజియం కెవి. లక్ష్మీనారాయణ, ఎస్ఎఇ ఎస్. అప్పలనాయుడు, ఇఇలు పి.మురళీకృష్ణ, జి.. సురేష్ బాబు, పి.త్రినాథ్, కెవి సత్యన్నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.




విజయనగరంలో ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ; భోగాపురం.. మొక్క నాటుతున్న మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు

శృంగవరపుకోట : స్థానిక ఆర్‌టిసి డిపోలో మేనేజర్ కె.రమేష్ ఆధ్వర్యంలో శుభ్రం చేశారు. గ్యారేజ్‌లో చలివేంద్రం ఏర్పాటు చేశారు. అటవీ శాఖ సహకారంతో టేకు, నేరేడు, మారేడు తదితర నాటించారు.

లక్కవరపుకోట : లక్కవరపుకోట మేజర్ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ కె.పార్వతి ఆధ్వర్యాన మొక్కలు నాటారు. చలివేంద్రాలు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కెవిఎస్ఎస్ కుమార్, పంచాయతీ కార్యదర్శి డి.స్వరూపి, ఐసిడిఎస్ సూపర్వైజర్ భాగ్యలక్ష్మి, ఎపిఒ ఎం.విజయలక్ష్మి, ఫీల్డ్అసిస్టెంట్ జి.అరుణకుమారి, ఎఎన్ఎం ఈశ్వరమ్మ, హిమబిందు, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస : కొత్తవలస ఎంఆర్‌సిలో ఎంఇఒ జి.శ్రీదేవి మొక్కలు నాటారు. ఎండతీవ్రత, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు.

వేపాడ : మండలంలోని అరిగిపాలెం గ్రామంలో మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ, ఎంపిడిఒ సూర్యనారాయణ ఆధ్వర్యాన మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి రవికుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ వి.దేవి, పిఆర్ ఎఇ ఎం.ఆలీ, హౌసింగ్ ఎఇ గంగాధర్, ఎఒ యశ్వంతరావు, ఎపిఎం సూర్యనారాయణ, సర్పంచ్ డి.లక్ష్మి, ఉపసర్పంచ్ డి.వెంకట్రావు, ఎంపిటిసి టి.వి.రమణ పాల్గొన్నారు.


వేపాడ మండలం అరిగిపాలెంలో మొక్క నాటుతున్న అధికారులు

బాడంగి : బాడంగి సిహెచ్‌సిలో, గురుకులంలో ఎంపిడిఒ రామకృష్ణ, తహశీల్దార్ సుధాకర్, డిప్యూటీ తహశీల్దార్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఉష్ణతాపం ఉపశమనంపై అవగాహన కల్పించారు.

గజపతినగరం రూరల్ : మండలంలోని సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటారు. గజపతినగరం అగ్నిమాపక కేంద్రంలో మొక్కలు నాటడంతో పాటుగా అగ్నిమాపక అధికారి ఎంఎస్‌వి రవిప్రసాద్ ఆధ్వర్యంలో మజ్జిగ, తాగునీటి చలివేంద్రం జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేశారు.

బొండపల్లి : తహశీల్దార్ కార్యాలయం వద్ద ఇంకుడు గుంత ఏర్పాటు చేశారు. కార్యాలయ పరిసరాలను శుభ్రం చేశారు. మండల సముదాయం వద్ద జాతీయ రహదారి సమీపంలో చలివేంద్రాన్ని తహశీల్దార్ డి.రాజేశ్వరరావు ప్రాంభించారు కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ రాజేశ్వరరావు, ఆర్ఐ హరికృష్ణ పాల్గొన్నారు.

వంగర : వంగరలో వివిధ శాఖల అధికారులు మొక్కలు నాటారు. అనంతరం ర్యాలీగా అంబేద్కర్ సెంటర్ వద్దకు వెళ్లి, మానవహారం నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రఘునాథచారి, తహశీల్దార్ ధర్మరాజు, వైద్యాధికారి జ్యోతి, వ్యవసాయ అధికారి కన్నబాబు, తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం : భోగాపురం పంచాయతీ కార్యాలయం వెనుక భాగంలో మంచినీటి కోనేటి గట్టుపై మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు మొక్కలు నాటారు. అనంతరం మెడికల్ క్యాంపు, చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కిశోర్‌కుమార్, ఇఒపిఆర్‌డి గాయత్రి, నాయకులు కొమ్మూరి శుభోషణరావు, పల్లంట్ల జగదీష్, పడాల భానుప్రకాష్, పల్లంట్ల రాంబాబు, పసుపులేటి లోకేష్, బొడ్డ రమణబాబు, న్యాయవాది సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ : మోపాడ పిహెచ్‌సి ఆవరణలో ఎంపిపి బంటుపల్లి వాసుదేవరావు, మోపాడ సర్పంచ్ ప్రతినిధి రమేష్ మొక్కలు నాటారు. పక్షులకు తాగునీటి సదుపాయం కల్పించారు. చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మోపాడ సత్యంనాయుడు, నాయకులు విజయకుమార్, ఇఒపిఆర్‌డి డి.శ్రీనివాసరావు, మోపాడ పిహెచ్‌సి వైద్యులు శరణ్య, స్రవంతి, పంచాయతీ సెక్రెటరీ భవాని, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నెల్లిమర్ల : నగర పంచాయతీలో ఉష్ణ తాపంపై ప్రజాప్రతినిధులు, అధికారులు ర్యాలీ చేపట్టారు. అనంతరం మొయిద జంక్షన్‌లో మానవహారం నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ బంగారు సరోజిని, కమిషనర్ ఎ.తారకనాథ్, వార్డు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మెప్మా సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రామభద్రపురం : రామభద్రపురం పంచాయతీ, ప్రాథమిక పాఠశాలలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చింతల రామకృష్ణ, ఎంపిడిఒ రత్నం ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. అనంతరం వృద్ధులకు ఒఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. మూడు రోడ్ల కూడలి వద్ద మానవహారం నిర్వహించారు.

రాజాం : స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో ఎంపిడిఒ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పిచ్చి మొక్కలను తొలగించారు. పరిసరాలను పరిశుభ్రం చేసి, మొక్కలు నాటారు. సిబ్బందితో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు.

విద్యుత్తు, ఉపాధిపై సభ్యుల ఆగ్రహం

ప్రజాశక్తి-నెల్లిమర్ల


అధికారులను నిలదీస్తున్న సభ్యుడు

విద్యుత్తు సమస్యలు, ఉపాధి వేతనాల బకాయిలపై సర్పంచులు, ఎంపిటిసిలు భగ్గుమన్నారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ గ్రామాల్లో వదులుగా ఉన్న తీగలు సరిచేయలేదని, అప్రకటిత విద్యుత్తు కోతలు అమలవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి పనులు చేస్తున్న వారికి వేతనాలు త్వరితగతిన ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు విద్యుత్తు అధికారులు మరమ్మతుల పేరిట సరఫరా నిలిపి వేస్తున్నారని దుయ్యబట్టారు. అనంతరం నవోదయం–2లో భాగంగా నాటు సారా నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డిటి రవిశంకర్, ఎఒ సుదర్శనం, ఎక్సైజ్ సిఐ వెంకట్రావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి-సంతకవిటి

సంతకవిటిలోని అంబేద్కర్ జంక్షన్ ఎదుట ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని శనివారం మండల ప్రత్యేకాధికారి అల్లు సోమేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రతకు ఎక్కువగా ఉండడంతో ప్రజలు తగుజాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండలంలో పలు జంక్షన్ల వద్ద చికిత్స నిమిత్తం వైద్య సిబ్బందిని నియమించామన్నారు. సంతకవిటి, మండవకురిటి, సిరిపురం, మందరాడ గ్రామాల్లో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రతి రోజూ గ్రామాల్లో 30 మొక్కలు నాటుతామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ బి.సత్యం, ఎంపిడిఒ సురేష్ కుమార్, సర్పంచ్, టిడిపి మండల అధ్యక్షులు గట్టి భాను, ఐటిడిపి నియోజకవర్గ అధ్యక్షులు బవిరి శ్రీనుబాబు, తదితరులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్ : నగరంలో నిర్విరామంగా 1290 రోజులుగా రోజూ మధ్యాహ్నం పేదలకు ఉచితంగా భోజనం గౌరి సేవా సంఘం ఆధ్వర్యంలో అందించడం అభినందనీయమని జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు శనివారం నిత్యాన్నదానం క్షేత్రంలో కీర్తిశేషులు కాంద్రేగుల రామారావు (అలంకార్ ఫోటో స్టూడియో) పేరున వారి కుమారుడు సీనియర్ పాత్రికేయుడు కాంద్రేగుల శేఖర్ అందించిన చల్లని మంచినీరు అందించే కూలింగ్ ఫ్రిడ్జ్ ని భీశెట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా భీశెట్టి మాట్లాడుతూ తమ వంతు సాయం చేయాలనే తపన ప్రతి పౌరుడికి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో భీమరశెట్టి ఓం శంకర్, కాంద్రేగుల శేఖర్, మొల్లేటి నాయుడు, డాక్టర్ పాంద్రంకి వెంకటరమణ పాల్గొన్నారు.

కూచిపూడిలో బంగారు పతకాలు

ప్రజాశక్తి-బొబ్బిలి

కూచిపూడి నృత్యంలో బొబ్బిలి పట్టణానికి చెందిన మాస్టర్ కోన రవి, విద్యార్థిని రెడ్డి చాందిని బంగారు పతకాలు సొంతం చేసుకున్నారు. 2023లో హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో గిన్నిస్ రికార్డు ప్రదర్శనలో మాస్టర్ రవితోపాటు చాందిని పాల్గొని ప్రతిభ కనబరిచారు. డ్యాన్సులో ప్రతిభ కనబరచడంతో బంగారు పతకాలకు ఎంపిక చేశారు. జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ వారికి పతకాలను అందించి అభినందించారు. బంగారు పతకాలు సాధించడంతో చాందిని కుటుంబ సభ్యులు రెడ్డి సత్యం, విజయలక్ష్మి, రవీంద్ర, సంతోషి ఆనందం వ్యక్తం చేశారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

క్రీడలు విద్యార్థులకు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. పట్టణంలోని కేంబ్రిడ్జి నారాయణ స్కూల్ ఆవరణలో నిర్వహిస్తున్న వేసవి బాడ్మింటన్ శిబిరంలో పేరెంట్స్ మీటింగ్‌లో భాగంగా జిల్లా క్రీడా అధికారితోపాటు ఎమ్మెల్సీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ శిబిరానికి అన్నివిధాలా సహకారం అందిస్తానని తెలిపారు.

సారా రహిత గ్రామంగా కొయ్యకొండవలస

ప్రజాశక్తి-బొబ్బిలి

సారా రహిత గ్రామంగా కొయ్యకొండవలసకు మారుస్తామని ఎక్సైజ్ సిఐ పి.చిన్నంనాయుడు తెలిపారు. మండలంలోని కొయ్యకొండవలసలో శనివారం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. సారా రహిత గ్రామంగా ఎంపిక చేశామని, సారాకు దూరంగా ఉండాలని ప్రజలను కోరారు. నాటుసారాకు దూరంగా ఉంటామని గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.


ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న బంగారయ్య మాస్టారు

మనసు బంగారమయ్య

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మండలంలోని తంగుడుబిల్లికి చెందిన ఉపాధ్యాయుడు శివుకు బంగారయ్య మంచిమనసును చాటుకున్నారు. శనివారం ఆ గ్రామంలో మండుటెండలో ఉపాధి పనులు చేస్తున్న సుమారు 300 మంది కూలీలకు సొంత నిధులతో మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఇదొక్కటే కాదు, సేవా కార్యక్రమాల్లో బంగారయ్య చురుగ్గా ఉంటున్నారు. వేసవి సెలవులు ఇచ్చిందే తడువుగా సమాజానికి తన వంతు సేవ చేస్తూ ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారుల మన్ననలు పొందుతున్నారు.

వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన వైద్య శిబిరం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

శ్రీ సాయికృష్ణా వాకర్స్ క్లబ్, అంజనీపుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో 42వ డివిజన్ కామాక్షి నగర్, అయ్యన్న పేట జంక్షన్ వద్ద శనివారం మున్సిపల్ కార్పొరేషన్ నడక మైదానంలో క్వీన్స్ ఎన్ఆర్ఐ హాస్పిటల్ సౌజన్యంతో బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ సలహాదారులు, ఎలక్ట్ గవర్నర్ ఎ. తిరుపతి రావు, క్లబ్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ ఎ.ఎస్. ప్రకాశరావు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు తరుచుగా బి.పి, షుగర్ పరీక్షలనుచేసుకోవాలని,ఆహార నియమాలను పాటించడం అవసరమని తెలిపారు.ఉదయాన్నే నడుస్తూ, వ్యాయామాలు చేస్తూ ఆరోగ్యం కాపాడుకోవాలని కోరారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షులు తాడ్డి ఆదినారాయణ, కార్యదర్శి ఐ.వి ప్రసాదరావు కోశాధికారి ఆర్.సి.హెచ్. అప్పలనాయుడు, అంజనీపుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ క్లబ్ వ్యవస్థాపకులు త్యాడ రామకృష్ణారావు (బాలు) క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

వీధి విక్రయదారుల నమోదు

బొబ్బిలి : మున్సిపాలిటీలో వీధి విక్రయదారులు ఈ నెల 20లోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఒక ప్రకటనలో కోరారు. వీధుల్లో తిరుగుతూ కూరగాయలు, ప్లాస్టిక్, ఇతర నిత్యావసర సరుకులను అమ్ముతున్న వారంతా సచివాలయాలకు వెళ్లి పేర్లు ఆన్‌లైన్ చేసుకోవాలని కోరారు. ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్, వ్యక్తి ఫొటో, ఫ్యామిలీ ఫొటో, కుటుంబ వివరాలు, ఒటర్ ఐడి, వ్యక్తిగత ధ్రువీకరణ పత్రంతో సచివాలయాన్ని సంప్రదించాలని కోరారు.

నేడు కలేకూరి వర్ధంతి

వేపాడ : ప్రజాకవి, సినీ గేయరచయిత, అనువాదకుడు, ఉద్యమకారుడు కలేకూరి ప్రసాద్ వర్ధంతిని ఆదివారం విజయనగరంలో గల జిఎస్ఆర్ హోటల్లో ఉదయం 10గంటలకు నిర్వహిస్తామని బహుజన కళామండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆతవ ఉదయభాస్కర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి బహుజన మేధావులు శివశంకర్, గురాన అయ్యలు, ఆదాడ మోహన్ రావు, గంటాన అప్పారావు హాజరవుతారని చెప్పారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

ప్రజాశక్తి-బొండపల్లి, గజపతినగరం


పిడుగు పడి మృతిచెందిన గంగులు

మండలంలోని దేవుపల్లి, బోడసింగిపేట గ్రామాలలో శనివారం వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. గజపతినగరం మండలం తుమ్మికాపల్లికి చెందిన దేవర గంగులు (45) బొండపల్లి మండలం దేవుపల్లి సమీపంలో పిడుగు పడి మరణించాడు. దేవుపల్లి సమీపాన గొర్రెలమంద కాస్తుండగా పిడుగు పడటంతో గంగులు మృతిచెందాడు. బోడసింగిపేట గ్రామ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మరణించాడు. ఈ ఘటనలో కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ యు.మహేష్ తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పూసపాటి రేగ

మండలంలోని కామవరం జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై గత సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన తాలాడ సన్యాసిరావు (49) జిల్లా కేంద్రాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఓ వ్యక్తి నిర్లక్ష్యంగా బైక్ నడిపి వెనుక నుంచి ఢీకొడంతో.. సన్యాసిరావు తీవ్రంగా గాయపడి స్పృహ కోల్పోయాడు. 108 వాహనంపై సుందర పేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. అయినప్పటికీ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ పెద్ద మరణించడంతో పిల్లలు, భార్య అనాథలయ్యారు. పూసపాటిరేగ ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు. సన్యాశిరావు చిన్నతనంలోనే తండ్రి తాలాడ గురువులు రోడ్డు ప్రమాదంలో మరణించారు, తమ్ముడు గత సంక్రాంతి రోజు పచ్చకామెరులతో కన్నుమూశాడు.